ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 9 ఏప్రిల్ 2024





సైకత శుభాకాంక్షలు

ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస వద్ద సంగమయ్యకొండ దిగువన గేదెల హరికృష్ణ. శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ సైకల శిల్పం రూపొందించారు. చుట్టుపక్కల వారు ఈ సైకతశిల్పాన్ని చూసి.. హరికృష్ణను అభినందించారు.
- ఆమదాలవలస

నేడే ఉగాది





శ్రీకాకుళం పొట్టిశ్రీరాముల మార్కెట్‌లో రద్దీ..

- శ్రీక్రోధినామ సంవత్సరానికి స్వాగతం
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్లు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకొనేందుకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. మంగళవారం శ్రీక్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలకనున్నారు. కొత్త ఏడాదిలో తమకు అంతా శుభం కలగాలని కోరుకుంటున్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. రాశి ఫలాలు, పంచాంగ శ్రవణాలు వినేందుకు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. సోమవారం మార్కెట్‌లో సందడి కనిపించింది. పూజాసామగ్రి కొనుగోలుదారులతో శ్రీకాకుళంలోని పొట్టిశ్రీరాముల మార్కెట్, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస, సోంపేట, నరసన్నపేట, పాతపట్నం తదితర పట్టణాల్లో మార్కెట్లు కిటకిటలాడాయి. ఉగాది రోజు రైతులు ఏరువాక పూయనున్నారు. ఈ మేరకు కొత్తకర్ర, తాళ్లు తదితర వస్తువులు కొనుగోలు చేశారు. అలాగే షడ్రుచుల ఉగాది పచ్చడికి అవసమైన మామిడికాయలు, వేపపువ్వు, బెల్లం తదితర సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్ రద్దీగా కనిపించింది. బంగారం దుకాణాలు, విద్యుత్ పరికరాల దుకాణాలు కూడా కళకళలాడాయి. సెంటిమెంట్ ప్రకారం ఆభరణాలు, ఏసీ, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు తదితర వస్తువులు కొనుగోలు చేసి.. మంగళవారం ప్రారంభించనున్నారు.



శ్రీకాకుళంలో పూజాసామగ్రి కొనుగోలు..

విధి నిర్వహణలో
నిర్లక్ష్యం వద్దు

- ఫిర్యాదు వచ్చిన 24 గంటల్లోగా పరిష్కరించాలి
- నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 8: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ఫిర్యాదు వచ్చిన వెంటనే 24 గంటల్లోగా దాని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి చేపడుతున్న పనులు, మ్యాన్‌పవర్, శిక్షణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, రవాణా నిర్వహణ, సైబర్, సింగిల్ విండో అనుమతి సెల్ నిర్వహణ, లా అండ్ ఆర్డర్, మ్యాపింగ్, సెక్యూరిటీ ప్లాన్ తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'అధికారులు, సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా వారు పనిచేస్తున్న కేంద్రాలను విడిచి వెళ్లరాదు. విధుల నిర్వహణలో నిబంధనలు మీరిన అధికారులపై వేటు తప్పదు. పోలింగ్, కౌంటింగ్‌కి సంబంధించిన ఏర్పాట్లు ముందుగా చూసుకోవాలి. క్షేత్రస్థాయి సిబ్బంది తమ విధులను అప్రమత్తతతో నిర్వహించాలి. 13వ తేదీ లోగా పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలు పంపాలి. ఎన్నికల సంఘం నుంచి రావాల్సిన స్టేషనరీ త్వరగా తెప్పించాలి. పోలింగ్ రోజున 450 వాహనాలు సిద్ధం చేయాలి. అదనంగా 104 టాటా మ్యాజిక్ వాహనాలు సిద్ధం చేయాలి. అన్ని చెక్‌పోస్టుల్లో వెబ్‌కాస్టింగ్ కచ్చితంగా ఉండాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు మాత్రమే. మొత్తం ప్రక్రియను వీడియో తీయాలి. డీఎస్పీ స్థాయి అధికారి బందోబస్తు నిర్వహించాలి. పోలింగ్ రోజు మరింత అప్రమత్తంగా ఉండాల'ని ఆదేశించారు. ఎన్నికల సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావుని కలెక్టర్ అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్వోలు నూరుల్‌కమర్, భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన దొర, అప్పారావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జీఎస్టీ కమిషనర్ రాణీ మోహన్, సీపీవో ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

దాహం.. దాహం!

- పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో తాగునీటికి ఇబ్బందులు
- సమగ్ర మంచినీటి పథకం ఉన్నా.. నిష్ప్రయోజనం
- ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటి సరఫరా



పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో అడుగంటిన బావి..

- రెండేళ్ల నుంచి తాగునీటి బోర్లు, బావులు, పైలెట్ వాటర్‌స్కీమ్‌లు బాగుచేసి ప్రజలకు నీరందించాలని కోరుతున్నా పాలకులు ఎందుకు స్పందించడం లేదు?
- బోర్లు, పైలెట్ వాటర్‌స్కీమ్‌లు మంజూరై రెండేళ్లవుతున్నా ఎందుకు వాటిని వేయడం లేదు. ప్రజలంటే అంత చులకనా?. కనీసం సమగ్ర తాగునీటి పథకంలోనైనా తీసి నీరు ఇవ్వండి.
- ప్రతి మునిసిపల్ సమావేశంలోనూ 27, 29వ వార్డుల కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి అధికారులకు వేసే ప్రశ్నలివీ. ప్రతిపక్ష, విపక్ష నేతలు సైతం తాగునీటి కోసం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికారులు నిస్సహాయస్థితిని వ్యక్తం చేయడం తప్ప.. సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు. దీంతో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో దాహం కేకలు ప్రభుత్వానికి వినిపించవంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(పలాస)

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మునిసిపల్ సమావేశాల్లో కౌన్సిలర్లు నిలదీస్తున్నా.. తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపడం లేదనే ఆరోపణలున్నాయి. పది నెలలుగా వర్షాలు లేక భూగర్భ జలాలన్నీ ఇంకిపోయాయి. గతంలో వంద అడుగులు బోర్ తవ్వితే నీరు రాగా.. ప్రస్తుతం 300 అడుగులు లోతు కొడితేనే తప్ప నీరు రాని పరిస్థితి నెలకొంది. మునిసిపాలిటీకి తాగునీరు అందించేందుకు వంశధార ఆధారిత బావులు ఐదు నిర్మించగా.. నీరు రాకపోవడంతో ఆ బావులన్నీ ఎండిపోయాయి. ప్రత్యామ్నాయంగా పారసంబ గ్రామం పొలాల్లో బోర్లు తవ్వి అక్కడ నుంచి అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మునిసిపల్ ప్రజల అవసరాల కోసం ఇంటింటా కుళాయిల ద్వారా వారానికి ఒక రోజు నీరు అందిస్తున్నారు. దాతలు, మునిసిపల్ అధికారులు స్పందిస్తూ ట్యాంకర్ల ద్వారా రెండు రోజులకోసారి నీరు అందించే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో హడ్కోకాలనీ, సూదికొండకాలనీ, సాయిబులకాలనీ, శివాజీనగర్, పురుషోత్తపురం, ఉదయపురం, హరిజనవీధి, శాంతినగర్‌కాలనీ, తాళభద్ర, నర్సిపురం, పెంటవీధి, డెంకివీధి, నెహ్రూనగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. 500 అడుగుల లోతులో బోర్లు వేస్తే తప్ప నీరు రాని పరిస్థితి. ఇంటింటా కుళాయిలు, పబ్లిక్ కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరే ప్రస్తుతం ఈ ప్రాంత వాసులకు ఆధారం. దీంతో ప్రజలు తీవ్ర నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి గత అక్టోబరు నుంచే నీటి కష్టాలు ప్రారంభం కాగా.. అధికారులు ముందు చూపుతో ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. ప్రస్తుతం మునిసిపాలిటి అంతా నీటి కష్టాలు తీవ్రం కావడంతో అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు.

ముంచిన ఆఫ్‌షోర్ ఆధారిత తాగునీటి పథకం..

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మించే ఆఫ్‌షోర్ జలాశయం ద్వారా నీరు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.110 కోట్ల వ్యయంతో సమగ్ర ప్రణాళిక వేసింది. రిజర్వాయర్ నిర్మాణం ఆలస్యం కావడంతో మరే ఇతర పథకాలు మునిసిపాలిటీకి వర్తించడం లేదు. దీనిపై ఎన్ని ప్రతిపాదనలు పంపించినా ఆఫ్‌షోర్ కారణంగా ఉన్నతాధికారులు మౌనం దాల్చుతున్నారు.

మునిసిపాలిటిపై నుంచే ఇతర గ్రామాలకు నీరు..

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతో ఆర్భాటంగా సమగ్ర మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తూ తాగునీటి సమస్యలు తీరిపోయాయని సెలవిచ్చారు. వాస్తవానికి రూ.700కోట్ల వ్యయంతో నిర్మించిన మంచినీటి పథకం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పైనుంచే ఇచ్ఛాపురం నియోజకవర్గం వరకూ వెళ్తుంది. కానీ జంటపట్టణ ప్రజల దాహార్తిని మాత్రం తీర్చడం లేదు. అధికారులు చొరవ చూపి ఈ పైపులైన్లు మునిసిపాలిటీ మంచినీటి పథకానికి కలిపితే.. జంట పట్టణాల్లో తాగునీటి సమస్య తీరుతుంది. కనీసం ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రారంభమయ్యే వరకైనా నీటిని విడుదల చేస్తే తమకు ఇబ్బందులు ఉండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.సమగ్ర మంచినీటి పథకాన్ని మునిసిపాలిటీకి కూడా వర్తించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ఈ వ్యవహారంపై కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా ప్రత్యామ్నాయంగా మునిసిపల్, ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నామన్నారు. బోరుబావుల్లో నీరు నింపి మూడురోజులకోసారి కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. నీటిని వృధా చేయకుండా ప్రజలు వినియోగించాలని సూచించారు.



పనిచేయని సమగ్ర మంచినీటి పథకం..

టీచర్లకు
విదేశీ ప్రయాణాలకు నో

- ఎన్నికల విధులకు హాజరైన వారికే వర్తింపు

నరసన్నపేట, ఏప్రిల్ 8: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు విదేశీ ప్రయాణ అనుమతు లను రద్దు చేశారు. ఈమేరకు ఇటీవల పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మే నెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. అలాంటి వారు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత విదేశాలకు వెళ్లే ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీఈవోలు, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు, హెచ్‌ఎంలు ఈ ఉత్తర్వులు పాటించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో లేని ఉపాధ్యాయులకు ఆంక్షలు లేవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నకిలీనోట్లు స్వాధీనం

రణస్థలం, ఏప్రిల్ 8: పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద పోలీసులకు చిన్నపిల్లలు ఆడుకునే నకిలీ నోట్లు పట్టుబడ్డాయి. సోమవారం చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా.. జి.రామచంద్రరావు, హరిశ్రీను, జే.సునీల్ వద్ద చిన్నపిల్లలు ఆడుకునే రూ.9,85,500 నకిలీ నోట్లు పట్టుబడ్డాయి. అందులో రూ.10వేలు ఒరిజినల్ నోట్లు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఈ డబ్బులను విజయనగరం నుంచి ఒడిశాకు తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు జేఆర్ పురం ఎస్ఐ గోవిందరావు తెలిపారు.

పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ పూర్తి

గుజరాతీపేట, ఏప్రిల్ 8: శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో గత పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్ సోమవారంతో పూర్తయింది. ఈ నెల 1 నుంచి స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభం కాగా.. 1,98,449 పేపర్లు దిద్దినట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఉపాధ్యాయుల సహకారంతో స్పాట్ సక్రమంగా సాగడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

టెక్కలి, ఏప్రిల్ 8: బూరగాం పంచాయతీ మాదినవానిపేటకి చెందిన నక్క లచ్చయ్య(76) సోమవారం ఎండతీ తీవ్రతను తట్టుకోలేక వడదెబ్బకు గురై మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లచ్చయ్య సోమవారం ఆరుబయట స్నానానికి వెళ్లగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకున్న కొద్ది నిమిషాల వ్యవధిలోనే అతడు మృతి చెందాడు.



ఉయ్యాలపేటలో యువత, చిన్నారుల నిరసన

రోడ్డు నిర్మించకపోతే ఓటు వేసేదేలేదు

- ఉయ్యాలపేటలో యువత నిరసన

నందిగాం, ఏప్రిల్ 8: ఉయ్యాలపేట ప్రధాన సమస్య అయిన రోడ్డు నిర్మాణం చేపట్టే వరకు ఓటు వేసేది లేదంటూ స్థానిక యువకులు ప్రతిన బూనారు. ఈ మేరకు ఆదివారం రాత్రి యువత, చిన్నారులు ప్ల కార్డులు, కొవ్వొత్తులు పట్టుకుని నిరసన తెలిపారు. 'నో రోడ్-నో ఓట్' అంటూ నినాదాలు చేశారు. గ్రామానికి రోడ్డు నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు రాజకీయాలతో సంబంధం లేదని గ్రామానికి రోడ్డు వేసే వరకు ఓటుకు దూరంగా పేర్కొన్నారు. గ్రామ సమస్యను బాహ్య ప్రపంచానికి తెలిపేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామానికి పక్కా రహదారి నిర్మాణం, మంచినీటి సౌకర్యం, మౌలిక సదుపాయాల సాధనే లక్ష్యమన్నారు కార్యక్రమంలో గ్రామ యువత జనపాన కల్యాణ్, గణేష్, రాజు, రవి, దీర్ఘాసి కుమారస్వామి, తేజ, తులసీరావు, గేదెల నూకరాజు, సురేష్, పరపటి పృథ్వి పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులు కేంద్రానికి పట్టవా?

- విశాఖ ఉక్కును ఎందుకు ప్రైవేటీకరిస్తారు: సినీనటుడు నారాయణమూర్తి

పలాస, ఏప్రిల్ 8: ఉద్దానంలో కిడ్నీవ్యాధుల నివారణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి ఆరోపించారు. సోమవారం కాశీబుగ్గలోని ఓ లాడ్జిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'కిడ్నీ వ్యాధి బారిన పడి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొంతమంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదు' అని నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 'కిడ్నీ వ్యాధులపై అప్పటి నాయకులు దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు, కిల్లి కృపారాణి, నరేష్ కుమార్ అగర్వాలా వంటివారు స్పందించడం వల్ల అధ్యయనం ప్రారంభించారు. అనంతరం జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ పోరాటం చేశారు. సీఎం జగన్ పాదయాత్ర సమయంలో కిడ్నీ బాధితులకు ఇచ్చిన హామీ మేరకు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశారు. శుద్ధ జలాలు అందజేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కిడ్నీ బాధితులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలి' అని ఆయన కోరారు. అలాగే విశాఖ ఉక్కు పరిశ్రమ సక్రమంగా నడుస్తున్నా.. కేంద్రం నష్టాల సాకు చూపి ప్రైవేటీకరణకు ఎందుకు ప్రయత్నిస్తోందని ప్రశ్నించారు. 32మంది పోరాటయోధులు ఆత్మత్యాగం చేసిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని యోచించడం శోచనీయమన్నారు. ఇనుప ఖనిజ ముడిసరకును జపాన్‌కు ఎగుమతి చేస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. పదేళ్లుగా రాష్ట్రానికి ఇవ్వాల్సి నిధులు ఇవ్వలేదని, ప్రత్యేకహోదా కూడా అటకెక్కించిందని మండిపడ్డారు. సమావేశంలో డాక్టర్ వై.కృష్ణమూర్తి, మట్ట ఖగేశ్వరరావు, బాలాజీ, రుద్రమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

పింఛన్ అందక.. మందులు కొనలేక

- మంచానికే పరిమితమైన వృద్ధురాలు



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు పొట్నూరు కామేశ్వరమ్మ. వయసు 84 ఏళ్లు. నరసన్నపేట పట్టణంలోని లచ్చుమన్నపేటలో నివాసం ఉంటోంది. కొన్నేళ్లుగా ఈమె అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. ఈమెకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. అయితే ఈనెల 4న పింఛన్ కోసం ఆమె కుమారుడు మన్మథరావు సచివాలయానికి వెళ్లి ఈవో చిన్నారావుకు తన తల్లి పరిస్థితి వివరించారు. ఒక మనిషికి పంపిస్తామని చెప్పి ఆరో తేదీ వరకు పింఛన్ పంపిణీ చేయలేదు. మళ్లీ ఆరో తేదీన ఉదయం 11గంటలకు సచివాలయానికి కామేశ్వరమ్మ కుమారుడు మన్మథరావు వెళ్లగా.. పంపిణీ చేసే వ్యక్తి లేరని, ఇలా 45 మంది ఉన్నారని, సాయింత్రం రావాలని సిబ్బంది చెప్పారు. మళ్లీ సాయంత్రం 4గంటలకు సచివాలయం వెళితే పంచాయతీ సిబ్బంది ఒకరిని కామేశ్వరమ్మ ఇంటికి పంపించారు. సెల్‌ఫోన్ సక్రమంగా పనిచేయడం లేదని ఆ సిబ్బంది వెనుతిరిగారు. 8వ తేదీన డబ్బులు ఇస్తామన్నారు. తీరా.. సోమవారం పింఛను కోసం సచివాలయం కామేశ్వరమ్మ కుటంబ సభ్యులు వెళ్తే.. ఈనెలకు ఇవ్వలేమని సిబ్బంది చెప్పారు. ప్రతీ నెల మందుల కోసం పింఛన్ డబ్బుల మీద ఆధారపడ్డ కామేశ్వరమ్మ.. ఇప్పుడు మందులు ఎలా తెచ్చుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈవిషయంపై ఈవో చిన్నారావు వద్ద ప్రస్తావించగా అందరికి పంపిణీ చేయాలని సూచించామన్నారు.
- నరసన్నపేట

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చలివేంద్రాల ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్: నగరంలో ప్రభుత్వ పరంగా చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని ఈ నెల 2న 'చలి వేంద్రాలు ఎక్కడ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథ నం ప్రచురితమైంది. దీనిపై నగరపాలక కమిషనర్ స్పందించారు. చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. 20 ప్రాంతాలలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం చలివేంద్రాల నిర్వహణపై నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ తమీమ్ అన్సారియా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, వర్తకులు, వ్యాపారులతో సమావే శం నిర్వహించారు. అందరూ తమ కార్యాలయాలు, దుకాణాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని... వీలైతే మజ్జిగ పంపిణీకి సహకరించాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వివేకానంద



టెక్కలి: టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దివ్వల వివేకానంద ఎన్నికయ్యారు. సోమవారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా దాడి ధర్మారావు, కార్యదర్శిగా సంపతిరావు దివా కర్, సంయుక్త కార్యదర్శిగా మామిడి గాయత్రి షాలినీ ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. ఎన్నికల పర్యవేక్ష కులుగా పి.మధుబాబు, అద్దాల రాజేష్ వ్యవహరించారు.

మద్యం సీసాలు స్వాధీనం

లావేరు: అదపాకలో గుడ్ల రమణయ్య కిరాణా షాపులో అక్రమంగా విక్రయి స్తున్న 40 మద్యం సీసాలను సోమవారం లావేరు ఏఎస్ఐ భుజంగరావు సిబ్బందితో కలసి స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ రామారావు కేసు దర్యాప్తు చేస్తునట్లు చెప్పారు.

● జి.సిగడాం: నడిమివలసకు చెందిన కందుల ఉమామహేశ్వరరావు అక్ర మంగా మద్యం సీసాలు తరలిస్తుండగా ఎస్పీఆర్‌పురం కూడలి వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ వై.మధుసూధనరావు తెలిపారు. ఉమామహేశ్వరరావునుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.1,950 ఉంటుందని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

● శ్రీకాకుళం క్రైం: ఆమదాలవలస మండలం తోటాడ గ్రామానికి చెందిన నూక నర్సింగరావు 20 మద్యం సీసాలను బ్యాగులో తరలిస్తుండగా రాగోలు జంక్షన్ వద్ద ఎక్సైజ్ శాఖ పోలీసులు పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ జి.వాసుదేవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్ఛాపురానికి కొత్త రైలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయంలో మరో కొత్త రైలు ఆగింది. సోమవారం బరంపూర్-ఎర్నాకులం రైలుకు ఇచ్ఛాపురంలో హాల్ట్ కల్పించారు. ఉద యం 6.36 గంటలకు ఇది ఇచ్ఛాపురం చేరుకుంది. ఈ రైలు వాస్తవ సమయం వేకువ జామున 4.27 గంటలు. రెండు గంటలు ఆలస్యంగా ఇక్కడికి చేరుకుంది. ఇది బరంపురం నుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు మళ్లీ బయలదేరి ఎర్నాకులం వెళ్లింది. సోంపేట, పలాస, శ్రీకాకుళం రోడ్, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస మీదుగా దువ్వాడ చేరుతుంది. ఈ రైలు తిరుపతి ప్రయాణికులకు... వలస కార్మికు లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రాధికను హెడ్ కానిస్టేబుల్ సవర అనప, కానిస్టేబుల్ బురా సురేష్ కుటుంబ సభ్యు లు కలుసుకున్నారు. హెచ్‌సీ అనప భార్య లక్ష్మి, ఎసీ సురేష్ సతీమణి పద్మా వతిలకు డీజీపీ శాఖాపరంగా మంజూరు చేసిన చెక్‌ను ఎస్పీ రాధిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డా.జి.పద్మావతి, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, పరిపాలన అధికారి సీహెచ్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

లావేరు: తాళ్లవలసలో అభయాంజనేయ స్వామి వారి ఆలయ 12వ వార్షికోత్స వాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు ముప్పి డి సురేష్, మురళి కుటుంబ సభ్యులు పూజలు చేశారు. తాళ్లవలస, సుభద్రాపురం, బొడ్డపాడు, రావివలస గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన లలిత సంగీతం

శ్రీకాకుళం కల్చరల్: కవి దూసి ధర్మారావు జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం తరణి కృష్ణ స్మారక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దూసి ధర్మారావు రచిం చిన, ఆలపించిన లలిత సంగీత గీతాలను గాయకులు ఆలపించారు. గాయకు లు నిక్కు అప్పన్న, కళ్యాణం రామమోహన్ లలిత గీతాలను ఆలపించారు. దూసి వెంక ట రమణమూర్తి, రెడ్ క్రాస్ చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు, బలివాడ మల్లేశ్వరరావు, సురంగి మోహనరావు, మేడూరి ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోరువాని చెరువు ఆక్రమణలు తొలగించాలి

నరసన్నపేట: స్థానిక భవానీపురం వద్ద గోరువానిచెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలపై భవానీపురం వాసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం తహ సీల్దార్ కనకారావుకు వినతిపత్రం అందించారు. గతంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టా రని, ఇటీవల అధికార పార్టీ అండదండలతో ఒక వ్యక్తి అక్రమంగా నిర్మాణాలు చేప డుతున్నారని భవానీపురం సంక్షేమ సంఘ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం అక్రమ నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ కనకారావు ఆదేశించినా పంచాయతీ అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులకు పరామర్శ

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును సోమవారం తెలుగునాడు, అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘ సాధికార రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత పరామర్శించారు. ఇటీవల అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని నిమ్మాడలోని అచ్చెన్నాయుడు స్వగృహంలో అచ్చెన్నాయుడు, అతని సోదరులను పరామర్శించారు.

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

పలాస రూరల్: కాశీబుగ్గ ఎల్‌సీ గేటు సమీపంలోని శ్రీపంచముఖ ఆంజనేయా లయంలో మంగళ వారం నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు బుద్ధిరామ్ తెలిపారు. ఉగాది నుంచి ప్రత్యేక పూజలు చేసి వారం రోజుల పాటు సప్తసతి పారాయణం, అష్టమి రోజు చండీ హోమం, కుంకుమ పూజ లు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ రోజు శ్రీరామ నవమి, సీతారాముల పట్టాభి షేకంతో ఉత్సవాలను ముగించనున్నట్లు తెలిపారు భక్తులు పాల్గొనాలని కోరారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి

ఎచ్చెర్ల, ఏప్రిల్ 8: మాతృభాషపై మమకారం పెంచుకోవాలని ట్రిపుల్ ఐటీ, శ్రీకాకుళం క్యాంపస్ ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు అన్నారు. ఇక్కడి క్యాంపస్‌లో సోమవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో త్రీవన్ క్లబ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక యూనివర్సిటీల్లో సాహిత్యంపై ఆసక్తి పెంచాలన్నారు. ఏవో ముని రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాషలో ఆన్ లైన్‌లో మేగజైన్ తీసుకొచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు. కవితలు, కథలు, వ్యాసా లు, ఆధ్యాత్మిక పుస్తకాలు, నవలలు తదితర అంశాలపై అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరి నాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, తెలుగు శాఖ విభాగాధిపతి డాక్టర్ జి.ప్రకాశ రావు, అధ్యాపకులు డాక్టర్ పెద్దింటి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

14న 'నక్సల్‌బరి-నేటి సమకాలీనత'పై బహిరంగ సభ

పలాస రూరల్: విప్లవ నాయకుడు పైల వాసుదేవరావు 14వ వర్ధంతి సంద ర్భంగా ఈ నెల 14న మామిడిపల్లి గ్రామంలో 'నక్సల్‌బరీ విప్లవోద్యమం-నేటి సమకా లీనత' అంశంపై బహిరంగ సభ నిర్వహి స్తున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. నీలావతి గ్రామంలో సోమ వారం సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం విప్లవోద్యమంలో పైల వాసుదేవరావు అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాటం చేసి అశువులు బాసారన్నారు. సమావేశంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, కోదండరామ్, అరుణోదయ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛను ఇప్పించండి

సరుబుజ్జిలి: మూలసవలాపురానికి చెందిన శబరి కుల మహిళ గొల్లపల్లి యశోద తన బిడ్డలకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం వద్ద మొర పెట్టుకున్నారు. గొల్లపల్లి యశోద, గణేష్ దంపతులకు ఇద్దరు కుమారులు పోలియో వ్యాధిగ్రస్తులు. సీతారాం వద్దకు తల్లి యశోద దివ్యాంగ కుమారుడైన భరత్‌ను తీసుకొచ్చి ఐదేళ్లుగా పెన్షన్ కోసం అర్జీలు ఇచ్చినా అధికా రులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలియో వ్యాధితో పదేళ్ల గౌతమ్, ఎనిమిదేళ్ల భరత్ మంచాన పడ్డారని వివరించారు. దీనిపై స్పందించిన సభాపతి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యం..

టెక్కలి: రాష్ట్రంలోను, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి తోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. సోమవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల ముఖ్య నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని జగన్ దోపిడీ, హత్యా రాజకీయాలు, వైసీపీ గూండాల దాడుల నుంచి ప్రజలను కాపాడుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా ఉమ్మడి పార్టీ అభ్యర్థు లను గెలిపించు కోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, నియోజక వర్గ ఇన్‌చార్జి అట్టాడ రవిబాబ్జీ, టీడీపీ టెక్కలి మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, కోట బొమ్మాళి మాజీ ఎంపీపీ తర్రా రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్: నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. విజయవాడ, ఏపీ సెక్రటేరియట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, వేసవిలో విద్యుత్తు సరఫరా, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ మాట్లాడుతూ నీటి కొరత లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచనలు అందజేశామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని.. నీటి ఎద్దడికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఎదురైనా 91001 20602, 63099 00660, 94906 12633 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జాన్ బెన్‌హర్, ఇరిగేషన్ ఎస్ఈ డోల తిరుమలరావు, వంశధార ఎస్ఈ సుధాకర్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఏపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నేతలను ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్

ముద్దులు పెట్టి జగన్ సీఎం అయ్యాడు: ఎంపీ

జలుమూరు: ముద్దులు పెట్టి ముఖ్యమంత్రి పదవి చేపట్టి రాష్ట్రాన్ని దోచుకున్న వ్యక్తి జగన్ అని, ఇప్పుడు ప్రజలకు గుద్దులు గుద్దుతున్నాడని ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. తలతరియా, లింగాలపాడు గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్ర చారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరోసారి జగన్ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తు న్నాడని, దీనిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు కోసం ఉమ్మడి కూటమి అ భ్యర్థులను గెలిపించాలని కోరారు.

టీడీపీలోకి తలతరియా సర్పంచ్ తదితరులు..

తలతరియా సర్పంచ్ చల్ల షణ్ముఖరావు, ఉప సర్పంచ్ బలగ పద్మావతి, మాజీ సర్పంచ్ చల్ల అనూరాధలతో పాటు పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ రామ్మోహన్ నాయుడు, అసెంబ్లీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు పసల చిన్నవాడు, రావాడ రామారావు, కొర్రాయి అప్పలస్వామిలతో పాటు 100 కుటుంబా లు ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. జలుమూరు, సారవకోట మండ లాల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, టీడీపీ రా ష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రతినిధి తేజకుమార్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా విజయం సాధిద్దాం: శిరీష



పలాస: టీడీపీలో చేరిన వారితో గౌతు శిరీష

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలతో పనిచేసి విజయం సాధిస్తామని టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. సోమ వారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పని చేయాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్య దర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, బీజేపీ నాయకుడు రామానంద స్వామి, టీడీపీ నేతలు గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, నవీన్, గురిటి సూర్య నారాయణ, దాసరి తాతారావు, పి.వైకుంఠరావు, దుర్గారావు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కుటుంబాలు..

పలాస/హరిపురం: మందస మండలం దున్నూరు పంచాయతీ దుమ్ము వాళ్లరు, లోహరిబంద పంచాయతీ ధర్మాపురం గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు, తంగరపుట్టి, కుసుమాల గ్రామాల్లో సుమారు 100 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. సోమవారం టీడీపీ కార్యాలయంలో వారికి పార్టీ అభ్యర్థి గౌతు శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. మందస టీడీపీ నాయకులు బి.దుర్యో ధన, లింగరాజు, రుద్రయ్య, తాతారావు పాల్గొన్నారు.

ఆదాయాన్ని పెంచి... పథకాలు అమలు: అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: రాష్ట్రంలో ఆదాయాన్ని పెంచి ప్రజలకు సంక్షేమ కార్యక్రమా లు అమలు చేయడమే టీడీపీ లక్ష్య మని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని స్వ గృహం వద్ద సోమవారం విలేకరుల తో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయాన్ని పెంచే విధంగా చంద్ర బాబు నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తారన్నారు. వైసీపీ హయాంలో నిత్యా వసరాలతో పాటు విద్యుత్ చార్జీలు పెరిగాయన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించటమే కాక నిరుద్యోగ భృతిని అందిస్తామన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛను అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటయ్యేలా ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని అశోక్ కోరారు. నేతలు బి.రమేష్, మణిబాబు, వి.రంగారావు, కమల లోచన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ● సోంపేట: రాష్ట్రంలో దుష్టపాలన సాగిస్తున్న వైసీపీని తరిమికొట్టే సమయం వచ్చిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. జనసేన ఇన్‌చార్జ్ దాసరి రాజుతో కలసి పట్టణంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మంత్రి ధర్మానపై చర్యలేవీ?: శంకర్



మాట్లాడుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నియోజక వర్గంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు కులాల వారీగా సమావేశాలు నిర్వహిస్తే అధికారులు చర్యలు తీసుకోవ డం లేదని టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ నిరసన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. వరుసగా కుల సంఘా లతో ధర్మాన సమావేశాలు నిర్వహిస్తుంటే.. అనుమతులు లేవని తెలిసినా నోటీసులు ఇవ్వడం లేదని అధికారులను విమర్శించా రు. తాము, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలసి చిన్నపాటి సమావేశాలు నిర్వహిస్తుంటే కేసులు నమోదు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎన్నికల అధికారులు పక్షపాతం లేకుండా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని కోరారు.

● గార: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి సోమవారం ఉదయం బలరాంపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తన భర్త శంకర్‌ను గెలిపించాలని కోరారు.

కూటమితోనే ప్రజలకు న్యాయం: రవికుమార్



ప్రచారం చేస్తున్న రవికుమార్

బూర్జ: కూటమి అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగు తుందని ఆమదాల వలస టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికు మార్ అన్నారు. సోమవారం బూర్జ, చిన్న కురింపేట గ్రామాల్లో తనను గెలిపించా లని ప్రచారం చేశారు. రవికుమార్ మాట్లాడుతూ ఆమదాలవలస- శ్రీకాకుళం రోడ్డును నరకప్రా యం చేశారని ఆరోపించారు. రోడ్డు ప్రమాదా ల్లో జనం మరణిస్తున్నా చీమ కుట్టినట్టయినా లేకపోవడం విచారకరమన్నారు. అనంతరం ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన నాయకులు పేడాడ రామ్మో హన్‌రావు, బీజేపీ నాయకులు సూరపునాయుడు, మాజీ జెడ్పీటీసీ ఆనెపు రామకృష్ణ, వి.సీతా రాంబాబు, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు..

పొందూరు: సింగూరుకు చెందిన పలువురు అధికార వైసీపీని వీడి టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో సోమవారం ఆ పార్టీ కండువాలు కప్పుకు న్నారు. మాజీ సర్పంచ్ డి.జగన్మోహనరావు, నాయకులు దుప్పల గణపతి ఆధ్వర్యంలో బొడ్డేపల్లి గోవిందరావు, తమ్మినేని సుధాసిన రావు, బాడాన కూర్మారావు, సింగూరు లక్ష్మణరావుతో పాటు 10 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పాలి..

రణస్థలం: వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎచ్చెర్ల కూటమి బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం ఎన్ఈఆర్ క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జీసిగడాం పార్టీ నేతలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను గెలిపిస్తే తోటపల్లి, మడ్డువలస కాలువలు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ముప్పిడి సురేష్, బెండు మల్లేశ్వరరావు, లంక ప్రభ, డీజీఎం ఆనందరావు, గొర్లె లక్ష్మణరావు, ముక్కు ఆదినారాయణ, రౌతు శ్రీనివాస్, సంపతిరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఈఆర్, కలిశెట్టి

మేనిఫెస్టోల్లో ఓపీఎస్‌ను పెట్టాలి

పిన్నింటిపేట (పోలాకి): అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని పెట్టా లని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు చింతాడ దిలీప్, మండల నాయకులు మూల శ్రీనివాస్, సనపల శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం పిన్నింటిపేటలో ఏపీటీ ఎఫ్ (1938) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టు కోలేదని, ఐదేళ్లు పోరాడినా ఫలితం దక్కలేదన్నారు. అందువల్ల సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని అన్ని పార్టీలు హామీ ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ద్విచక్ర వాహనాలపై అప్రమత్తం

ఆమదాలవలస: ద్విచక్ర వాహనాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.వాయునందన్ దివాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం కనుగులవలసలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున గ్రామానికి చేరు కొని తనిఖీలు చేశారు. ఎటువంటి ప త్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తర లించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల క్రయ విక్రయాల సమయంలో పత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ దీపక్‌మిశ్రా, ఏఎస్ఐ లక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి

జలుమూరు (సారవకోట): ప్రజాస్వామ్యం కల్పిం చిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియో గించుకోవాలని ఎస్ఐ అప్పారావు అన్నారు. కుమ్మరిగుం ట, అలుదు, కేళ్లవలస సమస్యాత్మక గ్రామాల్లో సోమవా రం పోలీసు కవాతు నిర్వహించారు. పోలింగ్ సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి తగా దాలు జరుగకుండా ఉండేందుకు ముందస్తుగా కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కంచిలి: మండల కేంద్రంలోని మఠం చెరువులో ప్రమాదవశాత్తు ము నిగి జెన్నాఘయ్ గ్రామానికి చెందిన బుడ్డేపు నీలాద్రి (42) అనే వ్యక్తి మృ తి చెందాడు. ఈమేరకు మృతుడి కుటుంబ సభ్యులు, కంచిలి పోలీసులు తె లిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నీలాద్రి, అతడి భార్య జానకి కూలీ పను లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు రిత్విక్, నరేష్ ఉన్నారు. సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్ళిన నీలాద్రి చెరు వులో ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందాడు. చెప్పులు, దుస్తులు చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సోంపేట ఫైర్ సి బ్బంది ఎస్ మోహనరావు, భాస్కరరావు, సింహాచలం ఈశ్వరరావు, రమణ, బాబు చెరువులో గాలించి... నీలాద్రి మృతదేహాన్ని కనుగొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు.

మద్యం మత్తులో హల్‌చల్

శ్రీకాకుళం క్రైం: నగరంలోని కొన్నా వీధిలో మాజీ రౌడీషీటర్ మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేర కు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ కనక రాజు ఆదివారం రాత్రి విధుల్లో భాగంగా కొన్నా వీధిలో గస్తీ కాస్తుండగా ఇద్దరు వ్యక్తులు తారసపడ్డారు. ఆ సమయం లో అక్కడ ఎందుకు ఉన్నారని హెచ్‌సీ వారిని ప్రశ్నించారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పగా.. మద్యం మత్తులో ఉన్న వారిద్దరు దాడికి తెగబడ్డారు. ఈ విషయం సీఐ ఉమామహేశ్వరరావుకు కనకరాజు చెప్పడంతో వారిని స్టేషన్‌కు తరలించారు. మాజీ రౌడీషీటర్ మెండ నారాయణరావు, సోదరుడు దేవిప్రసాద్‌లుగా గుర్తించారు. కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు.

లోఓల్టేజి సమస్యను పరిష్కరించండి

● సబ్‌స్టేషన్ వద్ద లైదాం కాలనీవాసుల నిరసన

పొందూరు: కొంతకాలంగా తాము ఎదుర్కొంటున్న లోఓల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని లైదాం ఎస్సీ కాలనీవాసులు పొందూరు సబ్‌స్టేషన్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. తమ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం చాలకపోవడంతో లోఓల్టేజీ సమస్య ఏర్పడుతోందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని వారు తెలిపారు. తక్షణమే లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ గొర్లె అనంతరామకృష్ణ గ్రామస్తులతో కలసి ఏఈ పి.దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అరసవల్లి: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.కళావతమ్మ సూచిం చారు. సోమవారం రిమ్స్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నా ఆరోగ్యం - నా హక్కు' అనే అంశంపై విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్ పీవో కె.పద్మావతి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కళావతమ్మ మాట్లాడుతూ ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరికీ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఏపీవో పి.సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎమ్.మిచెల్, బి.ఉషా పన్నగవేణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో దర్శకుడు చందు



ఆదిత్యాలయంలో సినీ దర్శకుడు చందు మొండేటి

అరసవల్లి: ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అయిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారిని సోమవారం ప్రముఖ తెలుగు సిని మా దర్శకుడు చందు మొండేటి తన మిత్రులతో కలసి దర్శించుకు న్నారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేద మంత్రా లతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాలను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి అందజేశారు.

'తండేల్' చిత్ర బృందం సందడి..

ఎచ్చెర్ల: గీతా ఆర్ట్స్ బేనర్‌పై నాగచైతన్య, సాయిపల్లవి ప్రధాన పాత్రధారులుగా నిర్మిస్తున్న 'తండేల్' చిత్రం సాంకేతిక బృందం సోమ వారం కొత్తమత్స్యలేశం గ్రామాన్ని సందర్శించింది. చిత్ర దర్శకుడు చందు మొండేటి, అసిస్టెంట్ డైరెక్టర్లు, కెమెరామెన్ తీర ప్రాంతాన్ని పరిశీలించా రు. ఈ నెలాఖరులో కొన్ని సన్నివేశాల చిత్రీకరణకు సన్నాహాలు చేస్తు న్నారు. గుజరాత్‌లో చేపల వేటకు వెళ్లి పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన వారి ఇతివృత్తం ఆధారంగా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా హీరో అక్కినేని నాగచైతన్య ఈ గ్రామాన్ని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. సినిమా సాంకేతిక బృందాన్ని మత్స్యకారులు సాదరంగా స్వాగతించి.. తమ అనుభవాలను వారితో పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు ఆంధ్రజ్యోతి

మేషం
(అశ్విని, భరణి, కృత్తిక 1 పాదం)
ఆదాయం: 8 - వ్యయం: 14
రాజపూజ్యం: 4 - అవమానం: 3

మేషరాశి వారు ఈ ఏడాది గృహ నిర్మాణం, స్థల సేకరణ ప్రయత్నాల్లో విజయం సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. విదేశీయానానికి అనుకూల సమయం. విద్యార్థులు విజయం సాధిస్తారు. కళలు, న్యాయ రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపారరంగంలోని వారు ఆచితూచి ముందడుగు వేయాలి. ఆర్థిక వ్యవహారాల్లో కొంత నెమ్మదిగా పురోగతి సాధిస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. ఊహించని ఖర్చులు వస్తాయి. అక్టోబరు-డిసెంబరు మాసాల మధ్య ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. బదిలీల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. బాంధవ్యాలు బలపడతాయి.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆరాధన శుభప్రదం

వృషభం
(కృత్తిక 2,3,4; రోహిణి; మృగశిర 1,2 పాదాలు)
ఆదాయం: 2 వ్యయం: 8
రాజపూజ్యం: 7 అవమానం: 6

వృషభ రాశి వారు ఈ ఏడాది ఆస్తులు పెంపొందించుకుంటారు. ఉద్యోగ, వ్యాపారాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. విదేశీ గమన ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళాకారులు, పత్రికలు, టెలివిజన్ రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. కోర్టు కేసులు వాయిదాపడతాయి. తోబుట్టువుల మధ్య అపార్థాలు పెరిగే అవకాశం ఉంది. అక్టోబరు - డిసెంబరు మాసాల మధ్య ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. సంకల్పం నెరవేరుతుంది. గౌరవ, మర్యాదలు పెంపొందుతాయి. ఆరోగ్యం మెరుగవుతుంది.

శ్రీ దుర్గామాత ఆరాధన వల్ల మేలు జరుగుతుంది

మిథునం
(మృగశిర 3,4 ఆరుద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)
ఆదాయం-5, వ్యయం-5,
రాజ్యపూజ్యం-3, అవమానం-6

మిథున రాశి వారికి ఈ ఏడాది ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. కొత్త వ్యాపారాలు ప్రారంభించి విజయం సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. గౌరవ, ప్రతిష్ఠలు పెంపొందుతాయి. కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారరంగంలోని వారు లాభాలు అందుకుంటారు. ఆర్థిక విషయాల్లో పురోగతి సాధిస్తారు. శుభకార్యాలు జరుగుతాయి. దంపతులు అన్యోన్యంగా ఉంటారు. సంతానం విషయంలో మంచి పరిణామాలు చోటుచేసుకుంటాయి. విదేశీ గమన యత్నాలకు అనుకూలం. అక్టోబరు - డిసెంబరు మాసాల మధ్య ఆర్థిక వ్యవహారాల్లో కొంత నిరుత్సాహంగా ఉంటుంది.

శ్రీరామచంద్రమూర్తి ఆరాధన శుభాలనిస్తుంది

కర్కాటకం
(పునర్వసు 4, పుష్యమి, ఆశ్లేష)
ఆదాయం-14, వ్యయం-2,
రాజ్యపూజ్యం-6, అవమానం-6

కర్కాటక రాశి వారికి 2024లో గృహయోగం కలుగుతుంది. ఆస్తులు పెంపొందించుకుంటారు. ఔషధాలు, వైద్యం, ఇన్సూరెన్స్ రంగాల వారు ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. వారసత్వ సమస్యలు పరిష్కారం అవుతాయి. కోర్టు వివాదాల్లో విజయం సాధిస్తారు. రాజకీయ, ప్రభుత్వ, సహకార రంగాలకు చెందిన వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అక్టోబరు - డిసెంబర్ మాసాల మధ్య విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపార రంగంలోని వారు లక్ష్యాలు సాధిస్తారు. గురుగ్రహం ఈ ఏడాది మీ జన్మ రాశి నుంచి 10, 11 స్థానాల్లో సంచరిస్తుంది. ఫలితంగా ఉద్యోగ, వ్యాపారాలలో కొన్ని చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఆస్తి నష్టం వాటిల్లుతుంది.

శ్రీ ఈశ్వరుడి ఆరాధన శుభ ఫలితాలనిస్తుంది

సింహం,
(మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదము)
ఆదాయం-2, వ్యయం-14,
రాజ్యపూజ్యం-2, అవమానం-2

2024లో సింహరాశి వారికి వ్యాపారం, ఉద్యోగాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. ఇల్లు లేదా స్థిరాస్తి సమకూర్చుకుంటారు. రుణాలు తీర్చే యత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యం మెరుగవుతుంది. విదేశీ గమన యత్నాలు ఫలిస్తాయి. వాహనం కొనుగోలు చేస్తారు. గృహనిర్మాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉన్నత పదవులు అందుకుంటారు. షేర్ల లావాదేవీల్లో లాభాలు గడిస్తారు. అక్టోబరు నుంచి ఆందోళనలు అధికమవుతాయి. వృత్తిపరమైన ఒత్తిడులకు లోనవుతారు. న్యాయ, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. గురువు 9, 10 స్థానాల్లో సంచారం చేయడం వల్ల ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం.

శ్రీ సుబ్రమణ్యస్వామి ఆరాధన శుభప్రదం.

కన్య
(ఉత్తర 2,3,4, హస్త, చిత్త 1,2 పాదాలు)
ఆదాయం-5- వ్యయం-5,
రాజ్యపూజ్యం-5 - అవమానం-2

కన్యా రాశి వారు 2024లో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారు. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. పైచదువులు చదివేందుకు, విదేశీ గమనానికి అనుకూలం. గృహనిర్మాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వివాహయత్నాలు సఫలమవుతాయి. వైద్యం, ఫార్మా, ప్రకటనలు, కన్సల్టెన్సలు, ఏజెన్సీలు, రాజకీయ, కళ, సినీ, రక్షణ, విద్య, ఐ.టి.రంగాల వారికి ప్రోత్సాహకరం. రుణ యత్నాలు ఫలిస్తాయి.అనుకున్న పనులు ఓరిమితో పూర్తిచేస్తారు. అక్టోబరు-డిసెంబరు మాసాల మధ్య ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి. విలువైన వస్తువులు కోల్పోవచ్చు. ఈ సంవత్సరం గురువు 8, 9 స్థానాల్లో సంచరిస్తున్న ఫలితంగా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

శ్రీ అంజనేయస్వామి ఆరాధన శుభప్రదం.

తుల
(చిత్త 3,4 స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు)
ఆదాయం-2, వ్యయం-8,
రాజ్యపూజ్యం-1, అవమానం-5

ఈ ఏడాది ఆస్తి పాస్తులు పెంపొందించుకుంటారు. సంకల్పం సిద్ధిస్తుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వాహనం కొనుగోలు చేస్తారు. బ్యాంకు డిపాజిట్లు, షేర్ల లావాదేవీలపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. కొత్త పరిచయాలు వల్ల లబ్ధి పొందుతారు. అక్టోబరు - డిసెం బరు మాసాల మధ్య ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి. పోటీలు, షేర్ల లావాదేవీల్లో జాగ్రత్త అవసరం. ఈ ఏడాది 7, 8 స్థానాల్లో గురుసంచారం ఫలితంగా వివాహాది శుభకార్యాలు జరుగుతాయి.

పార్వతీదేవి ఆరాధన శుభఫలితాలనిస్తుంది

వృశ్చికం
(విశాఖ 4, అనూరాధ, జ్యేష్ఠ)
ఆదాయం-8,వ్యయం-14,
రాజ్యపూజ్యం-4, అవమానం-15

వృశ్చికరాశి వారు 2024లో ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి సాధిస్తారు. కష్టానికి తగిన ప్రతిఫలం అందుకుంటారు. భూమి కొనుగోలు చేస్తారు. పెద్దలు, ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. వివాహ యత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు శుభప్రదం. బ్యాంకింగ్, షేర్‌మార్కెట్ రంగాల వారికి ప్రోత్సాహకరం. అక్టోబరు - డిసెంబరు మాసాల మధ్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. పెట్టుబడుల్లో ఆచితూచి ముందడుగు వేయాలి. ఉన్నత చదువుల కోసం చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. మీ జన్మరాశి నుంచి 6, 7 స్థానాల్లో గురు సంచారం ఫలితంగా ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల్లో పురోగతి కనిపి స్తుంది.

దత్తాత్రేయస్వామి ఆరాధన శుభఫలితాలనిస్తుంది.

ధనుస్సు
(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదము)
ఆదాయం-11, వ్యయం-5,
రాజ్యపూజ్యం-7, అవమానం-5

ధనుస్సు రాశి వారు ఈ సంవత్సరం ఉద్యోగ, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. భూమి కొనుగోలు చేస్తారు. బదిలీలకు అనుకూలం. పెద్దలతో పరిచయాలు ఏర్పడతాయి. వారి సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. సంతాన ప్రాప్తికి అను కూలం. ఆరోగ్యం మెరుగుపడుతుంది. అక్టోబరు - డిసెంబరు మాసాలలో ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలి. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ఆటంకాలు ఎదురవుతాయి. ఉద్యోగులు, వ్యాపారులు అప్రమత్తం గా వ్యవహరించాలి.5-6 స్థానాల్లో గురువు సంచారం కారణంగా ఈ ఏడాది ఉన్నత విద్యాయత్నాలు ఫలిస్తాయి.

శ్రీ సరస్వతి దేవి ఆరాధనతో శుభం కలుగుతుంది.

మకరం
(ఉత్తరాషాఢ 2,3,4 శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు)
ఆదాయం-14, వ్యయం-14,
రాజ్యపూజ్యం-3, అవమానం-1

మకర రాశి వారు 2024లో ఆస్తులు సమకూర్చుకుంటారు. స్థల సేకరణ, గృహ నిర్మాణ ప్రయత్నాల్లో విజయం సాధిస్తారు. గృహ నిర్మాణం, రియల్ ఎస్టేట్, నిర్మాణ సామగ్రి వ్యాపారులు పురోగతి సాధిస్తారు. కుటుంబ విషయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఉద్యోగంలో పురోగతి సాధిస్తారు. ఉన్నత విద్యాభ్యాసానికి అనుకూలం. వాహనం కొనుగోలు చేస్తారు. పెద్దల ఆరోగ్యం మెరుగవుతుంది. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. అక్టోబరు నుంచి ఖర్చులు అధికమవుతాయి. ఆస్తుల క్రయవిక్రయాల్లో చిక్కులు ఎదురవుతాయి. కుటుంబసభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి.

శ్రీ లలితాదేవి ఆరాధన శుభఫలితాలనిస్తుంది.

కుంభం
(ధనిష్ఠ 3,4 శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)
ఆదాయం-14, వ్యయం-14,
రాజ్యపూజ్యం-6, అవమానం-1

కుంభ రాశి వారికి ఈ ఏడాది ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆస్తులు సమకూర్చుకుంటారు. కీర్తి ప్రతిష్ఠలు పెంపొందుతాయి. విదేశాలకు వెళ్లే యత్నాలు ఫలిస్తాయి. ప్రచురణ, మార్కెటింగ్, రవాణా, స్టేషనరీ, విద్యారంగంలోని వారికి ప్రోత్సాహ కరం. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. కాంట్రాక్టులు, ఒప్పందాలు లాభిస్తాయి. అక్టోబరు-డిసెంబరు మాసాల మధ్య విద్యార్థుల్లో అశ్రద్ధ పెరుగుతుంది. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి.

శ్రీకృష్ణుని ఆరాధన శుభఫలితాలనిస్తుంది.

మీనం,
(పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర, రేవతి)
ఆదాయం-11, వ్యయం-5,
రాజ్యపూజ్యం-2, అవమానం-4

మీనరాశి వారికి ఈ ఏడాది సంకల్పం నెరవేరుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగంలో బదిలీలు, ప్రమోషన్లకు అవకాశం ఉంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారం విస్తరిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు పొందుతారు. పెట్టుబడులు లాభిస్తాయి. ఆరోగ్యం మెరుగవుతుంది. శుభకార్యాలు జరుగుతాయి. అక్టోబరు - డిసెంబరు మాసాల మధ్య తొందరపాటు నిర్ణయాల వల్ల ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. అనవసర ప్రయాణాలు, వాగ్వివాదాల కారణంగా చిక్కులు ఎదుర్కొంటారు. మీ జన్మరాశి నుంచి 2, 3 స్థానాల్లో గురుగ్రహ సంచారం కారణంగా స్థిరచరాస్తులు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

శ్రీ మహాలక్ష్మీదేవి ఆరాధనతో సత్ఫలితాలు సాధిస్తారు.